శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు

- పక్కనే పాఠశాల - భయం గుప్పెట్లో విద్యార్థులు, టీచర్లు
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంచినీటి ట్యాంకు శిథిలావస్థలో ఉంది. ఆ ట్యాంక్ నిర్మించి నేటికీ సుమారు 40 సంవత్సరాల పై మాటే మండలంలో పెదమేడపల్లి గ్రామం మేజర్ పంచాయితీగా పిలవబడుతుంది. సుమారు 15 వేలమంది పై సీల్ కు జనాభా కలిగిన గ్రామమంతటికి మంచి నీటిని సరఫరా చేసేది ఆ ట్యాంకే. ఇప్పుడు ఆ ట్యాంక్ శిథిలావస్తులో ఉండడం అనేకమందిని కలవరపరుస్తుంది. ట్యాంక్‌కు సంబంధించిన పిల్లర్స్, సిమెంట్ పెచ్చులు ఊడిపోయి ఐరన్ కనిపిస్తుండడం, ట్యాంక్ అడుగుభాగమున స్లాబ్ పెచ్చులు ఊడి పడిపోతుండడంతో ఎప్పుడు కూలిపోతుందో అన్న ఆందోళన పలువురిలో నెలకొంటోంది. ఇదిలా ఉండగా ఈ వాటర్ ట్యాంకు పక్కనే ఎంపీపీ స్కూల్ కూడా ఉంది. ఒకవేళ జరగరాని ప్రమాదం జరిగితే పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల పరిస్థితి ఏమిటో దేవుడెరుక. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం పైడిరాజును అడగ్గా పంచాయతీ సెక్రటరీకి, ఎంఈఓకు, డీఈఓకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. అయితే ఆర్‌డబ్ల్యుఎస్ వారు మాత్రం వచ్చి మరమ్మతులు చేసినా మరలా యధాస్థితికి చేరుకుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి ట్యాంకుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తహశీల్దార్ గారూ..కరుణించరూ..

జామికి శ్మశానానికి స్థలాన్ని కేటాయించాలని ప్రజల వేడుకోలు

విశాలాంధ్ర - జామి: కొన్ని తరాలుగా జామి గ్రామానికి సంబంధించి ప్రజలు వినియోగిస్తున్న శ్మశానవాటిక విశాఖ-రాయపూర్ హైవే పుణ్యమాని పూర్తిగా కనుమరుగు కానుంది. ఇప్పటికే హైవే అధికారులు కొంత వరకు రహదారిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం చిన్న పాటి స్థలంలో దహన సంస్కారాలు జరుగుతున్నాయి. కొద్ది రోజులలో మిగిలిన భాగాన్ని కూడా హైవే అధికారులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. ఇదే జరిగితే మండల కేంద్రం, మండలంలో ఏకైక మేజర్ పంచాయతీలో శ్మశానవాటిక లేకుండా పోతుంది.

నేతల హామీలు గాలిలోకే..

శ్మశానవాటికకు మంచి రూపురేఖలు తెస్తామని గతంలోని వైసీపీ నేతలు, ప్రస్తుతం ఉన్న టీడీపీ నేతలు హామీలు గుప్పించారు. కానీ మాటలు కోటలు దాటినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీంతో నమ్మకాలను కోల్పోయే పరిస్థితి వచ్చింది. దీంతో ఇప్పుడు ప్రజలు తహశీల్దార్ భరత్‌కుమార్‌పై ఆశలు పెట్టుకుంటున్నారు. తహశీల్దార్ జోక్యం చేసుకుని శ్మశానవాటికకు తగిన స్థలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తారనే పేరు తహశీల్దార్‌కు ఉండడంతో ఆయన హయాంలోనే శ్మశానానికి స్థల సేకరణ పూర్తి అవుతుందనే ఆశతో ప్రజలు ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - బొబ్బిలి: మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 7 నుండి 13 వరకు సచివాలయాలలో ఈనెల 14 పురపాలక సంఘ కార్యాలయంలో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి విలేకరులకు తెలిపారు. అందులో భాగంగానే బుధవారం పురపాలక సంఘ పరిధిలో గల పాత బొబ్బిలి, సంఘ వీధి, అగురువీధి సచివాలయాలలో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పౌర సమాచార అధికారి, పౌర సమాచార సహాయ అధికారి, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్, సచివాలయం నోడల్ ఆఫీసరు, సచివాలయ ఇన్చార్జి, సచివాలయ సిబ్బంది మరియు పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప పోరాట యోధుడు అల్లూరి: సీపీఐ

విశాలాంధ్ర - నెల్లిమర్ల: సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో బుదవారం మండలంలోని కొండ గుంపాం గ్రామంలో అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు మాట్లాడుతూ దేశంలో బ్రిటిష్ తెల్లదొరల దోపిడీని వ్యతిరేకిస్తూ, ఆదివాసీ గిరిజనులలో చైతన్యం నింపి గొప్ప పోరాటాలు నడిపిన మహాయోధుడు అల్లూరి అని పేర్కొన్నారు. దేశంలో తెల్లదొరలు పోయినా నేటికీ దోపిడీ అంతం కాలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయినా నేటికీ ఉపాధి లేక యువతీ యువకులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో పోలిపల్లి సూర్య తవిటి నాయుడు, లంక రాము నాయుడు, సూర్యారావు, బెల్లాన ఆదినారాయణ పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ పాయింట్ పరిశీలన

విశాలాంధ్ర - మెరకముడిదాం: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రా స్టూడెంట్ కిట్స్ పాయింట్‌ను సమగ్రశిక్ష జిల్లా సెక్టోరియల్ టీమ్ పరిశీలించింది. 2025-26 విద్యా సంవత్సరం కు సంబంధించిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్‌ను మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంచారు. సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సిఎంఓ వి.ఆదినారాయణ, అసిస్టెంట్ సీఎంఓ ఏ.రామారావు సందర్శించి ఇంతవరకు వచ్చిన స్టాక్ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎం.చంద్ర శేఖర్‌రావు, సి.ఆర్.యమ్.టిలు, ఎం.ఆర్.సి స్టాఫ్, పార్ట్ టైమ్ ఇనస్ట్రక్టర్స్ పాల్గొన్నారు.

తక్షణమే ఐఆర్ 30% ప్రకటించాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కే.జోగారావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: 12వ పీఆర్సీ కమిటీ వేసి తక్షణమే ఐఆర్ 30% ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కే.జోగారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యూత్ హాస్టల్లో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, పిఎఫ్ ఏపీజీఎల్ఐలతోపాటు పదవీ విరమణ పొందిన వారి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎం స్కూల్ అసిస్టెంట్ ఎస్జీటీలకు ప్రమోషన్ షెడ్యూల్ విడుదల చేసి బదిలీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు, ఆర్థిక కార్యదర్శి డి.ఈశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.బంగారయ్య, ఎంఏ స్వామి, ఆర్.వాసుదేవరావు, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో మరో అడుగు

- 9, 10 తేదీల్లో నాలుగు పారిశ్రామిక పార్కు(వాడ)లకు శంకుస్థాపన
- 9న ఎస్.కోట, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో....
- 10న గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో...
- ఎం.ఎస్.ఎం.ఇ. పార్కులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేస్తూ చిన్న పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు నాంది పలికింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక ఎం.ఎస్.ఎం.ఇ పార్కు(వాడ) ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా తొలివిడతలో జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1వ తేదీన నెల్లూరు జిల్లా నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ పార్కులను ఆయా నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసే ప్రాంతంలో ప్రారంభించే కార్యక్రమానికి ఆయా నియోజకవర్గ శాసనసభ్యులతో కలసి రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఎన్.ఆర్.ఐ. వ్యవహారాలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో తొలివిడతగా ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో 127.58 ఎకరాల్లో రూ.47.35 కోట్ల వ్యయంతో పారిశ్రామిక వాడలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపిఐఐసి) ఆధ్వర్యంలో ఈ ఎం.ఎస్.ఎం.ఇ. పార్కులు కానున్నట్టు ఆ సంస్థ జోనల్ మేనేజర్ ఎం.మురళీ మోహన్ వెల్లడించారు. మే 9వ తేదీ ఉదయం 9.00 గంటలకు ఎస్.కోట నియోజకవర్గ పరిధి బలిఘట్టంలో 57.09 ఎకరాల్లో రూ.7.00 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు మంత్రి శంకుస్థాపన చేస్తారని, తొలిదశలో ఇక్కడ 20 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో నెల్లిమర్ల ఎఫ్.ఎఫ్.సి.లో 15.55 ఎకరాల్లో రూ.15.55 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. 10వ తేదీ శనివారం ఉదయం 9.00 గంటలకు గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొండకిండాంలో 57.49 ఎకరాల్లో రూ.17.89 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న పారిశ్రామిక వాడకు, ఉదయం 11 గంటలకు బొబ్బిలి నియోజకవర్గ పరిధి కొట్టక్కిలో 10 ఎకరాల్లో రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న పార్కుకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారని ఏపిఐఐసి జోనల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గ శాసనసభ్యులు, జిల్లా అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

విశాలాంధ్ర - చీపురుపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబును విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అమరావతి సచివాలయంలో కలిశారు. ఇటీవల తనకు ఉమ్మడి విజయ నగరం జిల్లా డిసిసిబి అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు చంద్రబాబుకు నాగార్జున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయ పరిపాలనకు సంబంధించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పార్టీని సమన్వయంతో నడిపించాలని సూచించారు. ప్రజల కోసం కష్టపడి పని చేయాలని అన్నారు. డీసీసీబీపై పూర్తి అవగాహన ఏర్పరచుకొని రైతులకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు.

ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్య 'ఆపరేషన్ సిందూర్'

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - విజయనగరం: అందమైన ప్రదేశాలను చూసి ఆస్వాదించేందుకు, ఆహ్లాదమైన వాతావరణంలో గడిపేందుకు వెళ్లిన అమాయకులైన పర్యాటకులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్యే "ఆపరేషన్ సిందూర్" అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పహల్గామ్ దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. భారత సాయుధ బలగాలు ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడి చేసి గట్టి సమాధానమిచ్చాయని, తీవ్రవాదంపై భారత ఉక్కు సంకల్పానికి ఇది ఒక నిదర్శనం అని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి వందనం అని పేర్కొన్నారు. అమాయకులైన పర్యాటకులను బలిగొన్న ఘటన హృదయ విదారకమైనదని, దేశ సమగ్రతకు, ఐక్యతకు చిచ్చు పెట్టాలని చూస్తే సహించబోమని తెలిపారు. చేసిన పాపానికి పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఉగ్రవాదుల దాడుల నుంచి దేశ పౌరులను రక్షించు కుందామని పిలుపునిచ్చారు.

మలేరియా నిర్మూలనకు ఇంటిలోపలే స్ప్రే

ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మలేరియా నిర్మూలనకు ఇంటి లోపల గోడలమీద ఏసిఎం 5 శాతం (ఆల్ఫా సైఫర్ మెత్రిన్) స్ప్రే చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ సూచించారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 157 గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో అమలు చేయనున్న మలేరియా నిర్మూలనా కార్యక్రమంపై అధికారులతో ఆయన బుధవారం తమ ఛాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాప్తిని నిరోధించడానికి మొత్తం 22 పిహెచ్‌సిల పరిధిలోని 157 గ్రామాల్లో రెండు విడతలుగా ఏసీఎం మందును పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్ల నివేదికల ఆధారంగా ప్రతీ వెయ్యి మంది జనాభాకు రెండు లేదా అంతకన్నా ఎక్కువ మలేరియా కేసులు నమోదైన గ్రామాలను మలేరియా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి, ఈ కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా మే 1 నుంచి జూన్ 15 వరకు మొదటి విడత, జులై 1 నుంచి ఆగస్టు 15 వరకు రెండో విడత ఏసిఎం మందును పిచికారీ చేయనున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారాన్ని తీసుకొని, ప్రతీఒక్కరూ భాగస్వాములై, జిల్లాలో మలేరియా నిరోధించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కేంద్రం నుంచి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా మలేరియా అధికారి మణి పాల్గొన్నారు.

నిరుపేద స్పౌజ్ పెన్షన్ నిలుపుదల అన్యాయం

విశాలాంధ్ర - వంగర: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని అర్హతలు ఉన్న నిరుపేదరాలి స్పౌజ్ పెన్షన్‌ను నిలుపుదల చేశారు. కూలి, నాలి చేస్తే తప్ప పూట గడవని పరిస్థితి. మండలంలో మగ్గూరు గ్రామానికి చెందిన పెనుగుర్తి దాలమ్మ భర్త మరణించి సంవత్సరం రెండు నెలలు గడుస్తున్నప్పటికీ స్పౌజ్ (వితంతువు) పింఛను ఆప్షన్ లేక ఇంతవరకూ పింఛను పొందటానికి వీలు లేకపోయింది. దాలెమ్మ భర్త పెనుగుర్తి సూర్యనారాయణ 2024 మార్చి నెల 25న మరణించారు. దీంతో దాలెమ్మ పింఛను కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ఆన్‌లైన్ చేసిన తదుపరి ఎంపీడీఓ లాగిన్ నుంచి పింఛను మంజూరుకు సిఫార్స్ చేయవలసి ఉంటుంది. ఎంపీడీఓ ఈ స్పౌజ్ పింఛను మంజూరు కోసం సిఫార్స్ చేయకుండా లాగిన్‌లో పెండింగ్‌లో పెట్టి పింఛను మంజూరుకు కాకుండా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు పింఛన్ మంజూరు చేయాలని ఆమె కోరుతోంది.

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: పాకిస్తాన్‌పై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని మండలంలోని బొడ్డవర గ్రామంలో ఆర్యవైశ్య మహిళలు వారి కులదేవత అయిన వాసవి మాతకు పూజలు చేశారు. బుధవారం వాసవి మాత జయంతిని పురస్కరించుకొని అమ్మవారికి పలు రకాలు పూజలు చేశారు. అనంతరం వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు పూసర్ల కోటిరత్నం, కందుకూరి కళ్యాణి తదితరులు మాట్లాడుతూ పాకిస్తాన్ పైశాచికత్వానికి భారత్ ఈ ఆపరేషన్ ద్వారా సరైన బదులిస్తుందన్నారు. వాసవి మాత జయంతి సందర్భంగా గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘంకు చెందిన కందుకూరి ఈశ్వరరావు, నర్సింగ్ రావు, రమేష్ అన్న సమారాధన నిర్వహించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - వేపాడ: రాష్ట్ర ముఖ్య మంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి అన్నారు. బుధవారం నియోజక వర్గంలో పలువురికి ఆమె సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతపురం క్యాంపు కార్యాలయంలో మొత్తం 5గురుకి రూ.4లక్షల రూపా యలకు పైగా చెక్కులు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందు కున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే లలిత కుమారి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తానని మాటిచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం ఆ మాటను నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ, అప్పల రాం ప్రసాద్, లాలం అర్జున్ రావు, చింతల పాలెం సర్పంచ్ మాకేన నవిన్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు అండగా భారత పౌర సమాజం

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: రెచ్చిపోతున్న పాకిస్తాన్ తీవ్రవాదులను మట్టుపెట్టడానికి భారత ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయానికి లోక్‌సత్తా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ భారతదేశంలోని త్రివిధ దళాలకు దేశంలోని మొత్తం పౌర సమాజం అండగా ఉంటుందని, ఆపరేషన్ సింధూర్ నిర్ణయం దేశంలోని ప్రజలు మొత్తం హర్షిస్తున్నారన్నారు. పాకిస్తాన్ తేరుకునే లోగా 9 ప్రాంతాల్లో ఆపరేషన్ సింధూర్‌ని పూర్తిచేసిన త్రివిధ దళాల అధిపతులకు భారత జాతి మొత్తం జేజేలు పలుకుతుందని భీశెట్టి అన్నారు. భారత ఆర్మీ, వాయుసేన అధికారులు అత్యంత చాకచక్యంగా పాకిస్థాన్‌లో ముష్కరులను మట్టుపెట్టారని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం, పౌర వేదిక ప్రతినిధులు తుమ్మగంటి రాంమోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాల గుడిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - భోగాపురం: పదో తరగతిలో కలసి చదువుకొన్న విద్యార్థులంతా 42 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో చేరి నాటి స్నేహాలతో నేడు సంబరాల సందడి చేశారు. భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో 1982- 83లో పదవ తరగతి చదువుకున్న 70 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. 42 సంవత్సరాల జ్ఞాపకాలకు తిరుగు ప్రయాణమయ్యారు.ఆ రోజుల్లో తమకు అక్షర జ్ఞానం అందించిన ఉపాధ్యాయులను పిలిచి ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అలాగే ఇదే బ్యాచుకు చెందిన పూర్వ విద్యార్థి ప్రస్తుతం డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్న ఇనపకుర్తి చిన సత్యనారాయణ ఆర్ట్ గేలరీ ఆకట్టుకొంది. ఈ కార్యక్రమానికి అతిధులుగా ఇదే పాఠశాలలో చదువుకుని ప్రస్తుతం విశాఖపట్నంలో ఎ.సి.పిగా విధులు నిర్వహిస్తున్న సురాబత్తుల అప్పలరాజు, అలాగే ప్రస్తుతం భోగాపురం మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న బాలిపల్లి చంద్రమౌళి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వరుపుల ఉమామహేశ్వరరావు, రామిజిన్న శ్రీనివాసరావు, అడపా ప్రసాదు అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వవిద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశుదాణా పంపిణీ

విశాలాంధ్ర - లక్కవరపుకోట: పాడి రైతులకు రాయితీతో కూడిన పశుదాణా సరఫరా ప్రభుత్వం చేస్తున్నట్లు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం స్థానిక పశువైద్యాలయంలో పాడి రైతులకు దాణా పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 కిలోల దాణా సంచి 1110 రూపాయల ధర నిర్ణయించగా సగం రాయితీతో 550 రూపాయలకు అంది స్తున్నట్టు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కాడి రైతులు దీనికి అర్హులని ఆమె అన్నారు. పాడి రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ కోరాడ గాయత్రి, నీటి సంఘం అధ్యక్షులు పుట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాస విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణం జండా మహల్ జంక్షన్ వద్ద శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభిస్తోంది. గత వారం రోజులు గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి ఆధ్వర్యంలో శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలతో పాటు కథలు చదివించడం, వివిధ ఆటలాడించడం చేస్తున్నారు. దీంతో గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలకు వచ్చే విద్యార్థులకు మంచి సేవలు అందిస్తున్నారని అభినందనలు తెలిపారు.

ఘోషా ఆసుపత్రికి ఎంపీ ల్యాడ్స్ నిధులు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: విజయనగరంలో గల ఘోషా ఆసుపత్రిని బుధవారం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన వెంటనే ఘోష ఆసుపత్రి, జిల్లా కేంద్ర ఆసుపత్రిని సందర్శించడం జరిగిందని, ఆసుపత్రులలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఘోష ఆసుపత్రి భవనం యొక్క సామర్థ్యం తగ్గిపోయినందున ఆసుపత్రిలో అవసరమైన కొన్ని సదుపాయాలను వినియోగించుకో లేకపోతున్నారని, అందుచేత రాజ్యసభ ఎంపీ విజయేంద్ర ప్రసాద్‌కి చేసిన విజ్ఞప్తి మేరకు వారి ఎంపీ లాడ్స్ నిధుల నుండి ఘోష ఆసుపత్రి అప్ గ్రేడేషన్ కొరకు రూ.50 లక్షల మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆసుపత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయుట కొరకు వారి యొక్క ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.26.5 లక్షల నిధులను మంజూరు చేసారని తెలిపారు.

కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - రాజాం: మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బొబ్బిలి రోడ్డులో గల కేశవ జ్యూట్ మిల్స్‌లో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కుమారి కె.నైమిష అధ్యక్షతన అసంఘటిత రంగ కార్మికుల వారోత్సవాల్లో భాగంగా కార్మిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల హక్కుల గూర్చి వివరించారు.

సదస్సులో రాజాం సహాయ కార్మిక అధికారి బి.కొండలరావు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. సదస్సులో రాజాం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్.మురళీధర్, సీనియర్ న్యాయవాదులు ఆర్.విజయ్కుమార్, ఎం.శ్రీనివాసరావు, రాజాం టౌన్ ఎఎస్ఐ కె.వి.రమణ మూర్తి, కోర్టు లైజన్ ఎఎస్ఐ సూర్యనారాయణ, ఏరియా ఆసుపత్రి వైద్యులు డా.వి.అప్పలనాయుడు, జనరల్ మేనేజర్ కె.జగన్మోహన్‌రావు, జూట్ మిల్ హెచ్ఆర్ మేనేజర్ ఎస్.పాండె, పారా లీగల్ వాలంటీర్లు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో ప్రధాన కాలువల్లో భారీ ఎత్తున పూడికతీత కార్యక్రమాలు ఊపందుకున్నాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో జెసిబిలు, బాబ్ కార్టుల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి వేస్తున్నారు. దీంతో గుట్టల గుట్టలుగా పూడిక బయటపడుతుంది. ప్రధానంగా మార్కెట్ ప్రాంతం, రద్దీ ఉన్న ప్రదేశాలలోని ప్రధాన కాలువలో ప్రతి ఒక్కరూ చెత్తాచెదారాలను కాలువల్లో పారబోయడంతో ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందని కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు. దీనివల్ల మురికి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుందన్నారు. వర్షాలు కురిసే సమయంలో ఇబ్బందికరమైన పరిస్థితులు మరింత తీవ్రతరమవుతున్నాయన్నారు. వ్యాపారస్తులు, ప్రజలు సహకరించి కాలువల్లో చెత్తాచెదారాలు వేయకుండా డస్ట్ బిన్లను ఉపయోగించుకోవాలని కోరారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ సమేత ఆరాధన కళ్యాణం

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో బుధరాయవలస గ్రామంలో బుధవారం శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ సమేతంగా ఆరాధన కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. 3000 మంది భక్తులు హాజరై శ్రీ శ్రీ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో స్వామి భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి ఏటా శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ ఆరాధన మహోత్సవ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా అన్న సమారాధన ఏర్పాటు చేయడం జరిగిందని శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సంస్కృతిక కార్యక్రమాలను చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉప సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన శంబంగి

విశాలాంధ్ర - బొబ్బిలి: మండలం చింతాడ గ్రామ ఉప సర్పంచ్ మరడాన పార్వతమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బుధవారం అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హుటాహుటిన చింతాడ గ్రామం వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడవద్దు అని పార్టీ అండదండలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్ బంకురు తిరుపతి,మండల పార్టీ అధ్యక్షులు తమ్మిరెడ్డి దామోదర్, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షులు మరడాన విశ్వేశ్వరరావు, వైసిపి నాయకులు ఉన్నారు.

ముగిసిన మేడే వారోత్సవాలు..

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఏ కృష్ణ ప్రసాద్ మంగళవారం మే డే వారోత్సవాల్లో భాగంగా చివరి రోజులో భాగంగా విజయనగరంలోని అసంఘటిత భవన నిర్మాణ కార్మికులకు న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వారి కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ దుర్గయ్య, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి పాల్గొన్నారు. కార్మిక శాఖలో అమలవుతున్నటువంటి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్మిక చట్టాల గురించి, వేతన సవరణ చట్టం గురించి, వారి హక్కులు బాధ్యతలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి శ్రీనివాస్ హాజరైనటువంటి అసంఘటిత భవన నిర్మాణ కార్మికుల దగ్గర వివరాలను సేకరించారు. వారందరికీ ఈ శ్రమ కార్డులను అందజేయడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

గంజాయితో ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

విశాలాంధ్ర-రాజాం: రాజాం ఎస్సై వై.రవికిరణ్ కి వచ్చిన సమాచారం మేరకు రాజాం-శ్యాంపురం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అగ్రహారం జంక్షన్ దగ్గర డియో స్కూటీపై కోటారిపురం గ్రామానికి చెందిన పంచిరెడ్డి వెంకటరమణ, డోలాపేటకు చెందిన పూతిక హరిశంకర్ అను ఇద్దరు వ్యక్తులు 1కేజీ గంజాయితో పట్టుబడ్డారు. వారి ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కేసును ఇంచార్జ్ సీఐ హెచ్.ఉపేంద్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలియపరిచారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి సిరిమాను తొలగింపు

విశాలాంధ్ర - డెంకాడ: నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం అక్కివరం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా నిర్వహించిన సిరిమాను తొలగింపు కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం మాధవి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు, పల్లె భాస్కర్‌రావు, పాణి రాజు, చిన్నమనాయుడు, సువ్వాడ రవి శేఖర్, జనసేన పార్టీ నుండి కంది సూర్యనారాయణ, కంది కిరణ్, ఎంపీపీ వాసుదేవ రావు, పాల్ శ్రీను, ప్రకాష్, రామ్మూర్తి, దిండి చందు, గేద రమణ తదితర నాయకులు హాజరై అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

భూముల రీ సర్వే పరిశీలన

విశాలాంధ్ర - గంట్యాడ: గంట్యాడ మండలం సిరిపురం గ్రామంలో సంఘన్న చెరువు పొలం దగ్గర గల భూములను సందర్శించి సర్వే జరుగుతున్న పనితీరును తాసిల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. రీ సర్వే ప్రస్తుత సమయం వరకు ఎంతవరకు జరిగినది అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సర్వేకు సంబంధించిన కొన్ని అంశములపై మరియు సమస్యలపై సిబ్బందికి సంబంధిత హక్కుదారులైన భూ యజమానులకు సిబ్బందికి తాసిల్దార్ కొన్ని సూచనలు చేశారు. భూ తగాదాలకు సంబంధించి పరస్పర వ్యక్తులు ఒక అవగాహనకు వచ్చి వారి సమస్యలు ఈ సర్వేలో పరిష్కరించుకోవాలన్నారు. పోతి కేసులు అన్నదమ్ముల సమస్యలు ఈ సర్వేలో పరిష్కరించుకోవాలని భూములకు సంబంధించి నిష్పక్షపాతంగా రీ సర్వే చేయాలని సిబ్బందిని కోరారు. తాసిల్దార్ తో పాటు మండల సర్వేయర్ సత్యం డిటి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా బ్రిటీష్ వారిని 'ఢీ' కొట్టిన విప్లవ జ్యోతి అల్లూరి

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకొని, జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - భారతదేశానికి స్వాతంత్ర్యం కేవలం సాయుధపోరాటంతోనే సిద్ధిస్తుందని విశ్వసించి, స్వాతంత్ర్య సాధన కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవ పంథాను ఎన్నుకున్నారన్నారు. మన్యంలో బ్రిటీషు వారి దోపిడీని ఎదుర్కొని, గిరిజనులకు అండగా నిలిచి, వారిని ఎంతగానో చైతన్యపర్చారన్నారు. ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్య పోరాటం కోసం బ్రిటీష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఆయన ఢీ కొన్నారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు, బ్రిటీషు వారితో అలుపెరగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు చివరకు చిన్న వయస్సులోనే బ్రిటీషువారి తూటాలకు 1924సంవత్సరం మే 7న నేల కొరిగాడన్నారు. అల్లూరి సీతారామ రాజు నేడు భౌతికంగా మన మధ్య లేనప్పటికీ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చూపిన తెగువ, పట్టుదల మనందరికి ఆదర్శనీయమని స్ఫూర్తిదాయకమన్నారు. అల్లూరి చిత్ర పటానికి జిల్లా అదనపు పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు మరియు ఇతర పోలీసు అధికారులు పూల మాలలు వేసి, పుష్పాలు సమర్పించి, మౌనం పాటించి, ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డిపిఓ ఎఓ పి.శ్రీనివాసరావు, ఎస్పీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, డిసిఆర్బీ సిఐ బి.సుధాకర్, ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి, పలువురు ఆర్.ఎస్.ఐలు, సిబ్బంది, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు

విశాలాంధ్ర - జామి: మండల కేంద్రమైన జామిలో కొలువై ఉన్న ఆర్యవైశ్యులు కులదేవత అయిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా వైశాఖ శుద్ధ దశమి నాడు అమ్మవారి జయంతి ని జరుపుకుంటారు. ఈసందర్భంగా అలయ అర్చకులు యం.రవి శర్మ అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజలు చేశారు. ఈకార్యక్రమం లో మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం స్థానిక బస్సు స్టాండ్ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం మరియు వాసవీ క్లబ్ యూత్ వారు సంయుక్తంగా పులిహోర మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ తీగెల సతీష్ కుమార్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు విన్నకోట సీతారామయ్య, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.రంజిత్ కుమార్, వాసవీ క్లబ్ యూత్ అధ్యక్షుడు పి.సాయి, మాజీ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యిందుపూరి సుబ్బరాజు, వి.సంతోష్, ఐ.సాయికృష్ణ, వైష్ణవ్,వి.కామేశ్వరావు మరియు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: శ్రీ వాసవి మాత అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలు ఎస్.కోట వాసవీ క్లబ్ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాల స్వామి ఆలయం నుండి దేవితల్లి అమ్మవారి ఆలయం వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళ తాళాలతో, సాంప్రదాయ పద్ధతులతో ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు హెచ్.నానాజీ, వర్తక సంఘ ఉపాధ్యక్షులు కొల్ల వెంకటేష్, వాసవి క్లబ్ మెగా అధ్యక్షులు పి.అప్పారావు, వాసవి క్లబ్ యూత్ అధ్యక్షులు యు.విజయకుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం సహాయ కార్యదర్శి బాలనాగు శ్రీనివాస్, జోన్ చైర్మన్ ఎం.శివకుమార్, రీజనల్ సెక్రటరీ ఆదిమూలం హరీష్ కుమార్, పూర్వాధ్యక్షులు వేమూరి శ్రీనివాస్, జిల్లా ఆఫీసర్ ఆదిమూలం రత్నావతి, సంఘ ప్రముఖులు మద్దుల శ్రీనివాసరావు, తోట సినయ్య, తోట వాసు, ఉప్పల నర్సింగరావు, ఆదిమూలం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: వైశాఖమాస శుక్ల పక్ష దశమి బుధవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద ప్రధాన అర్చకులు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం 4 గంటల నుండి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని బంగారు చీరలో వజ్రకిరీటంతో దేదీప్యమాణంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ నారాయణం శ్రీనివాస్ మాట్లాడుతూ జయంతి సందర్భంగా అనేక కార్యక్రమంలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి చరిత్ర 25 ఘట్టాలను మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్ ఆవిష్కరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 102 రకాల పిండివంటలు అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో పులివేషాలు,కోలాటం సాంస్కృతిక కార్యక్రమంల నడుమ అంగరంగ వైభవంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ద్రాక్షా జ్యూస్, పులిహోర ప్రసాదంలు భక్తులకు పంపిణీ చేశారు. దేవస్థానం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా మజ్జిగ, మంచినీరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, గౌరవ అధ్యక్షులు కోలగట్ల వీరభద్రస్వామి, కాపుగంటి ప్రకాష్, పాలకమండలి సభ్యులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, మురుగన్, విజ్జపు వెంకట శ్రీనివాసరావు, బుద్దెపు వెంకటరావు, మామిడిపాక జగన్మోహన్ రావు, వెత్సా సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

9న శ్రీ సత్యమన్న పేరంటాల తీర్థం



విశాలాంధ్ర - లక్కవరపుకోట: ఈనెల 9న మండలంలోని ఎల్.కోట తలారి గ్రామంలో వెలసియున్న శ్రీ సత్యమమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం అతి వైభవంగా జరపబడునని నిర్వాహకులు వైసీపీ మండల కన్వీనర్ గుమ్మడి సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిది గంటలకు జిల్లాస్థాయి జూనియర్ విభాగం టాలెంట్ టెస్ట్ 8వ తరగతి విద్యార్థులకు, జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ సీనియర్ విభాగం 9 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఎనిమిది గంటలకు నిర్వహించబడుతుందని పది రకాల బహుమతులు ఉంటాయని వీరికి వెయ్యి రూపాయల నుంచి పదివేల రూపాయల వరకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని, మధ్యాహ్నం రెండు గంటలకు రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన ఉంటుందని దీనికి 12 రకాల ప్రోత్సాహక బహుమతులు 3000 రూపాయల నుంచి 20 వేల రూపాయల వరకు ఉంటుందని, 3 నుంచి నాలుగు గ్రూపుల పరుగు పోటీలు నిర్వహించబడతాయని 5000 రూపాయలు నుంచి 20వేల రూపాయల వరకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని, రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు ఉంటాయని ఇవి పది రకాల బహుమతుల 2000 నుంచి 20 వేల వరకు బహుమతులు ఉంటాయని, జిల్లాస్థాయి కోలాటం పోటీలు ఉదయం 9:30 నిమిషములకు జరుగుతాయని ఐదు రకాల బహుమతులు మూడు వేల రూపాయల నుంచి 15000 రూపాయల వరకు ఉంటుందని, రాత్రి 6:30 కు బాలు రైడర్స్ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్ కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జడ్పిటిసి సభ్యులు తూర్పాటి వరలక్ష్మి పాల్గొంటారన్నారు.

వీధి విక్రయదారులను గుర్తించండి: పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలోని వీధి విక్రయదారులను గుర్తించి కమిటీలను పునర్వ్యవస్థీకరించే కార్యక్రమం ఈనెల 14వ తేదీ లోపు పూర్తి చేయాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏమినిటీస్, ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీధి విక్రయదారులను గుర్తించే సర్వే ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. నగరంలో రెడ్, గ్రీన్, అంబర్ జోన్లను ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. వీధివిక్రయదారులకు గుర్తింపు కార్డులను కూడా అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్ జోన్ లో వీధివిక్రయాలు పూర్తిగా నిషేధమని చెప్పారు. గ్రీన్ జోన్‌లో వీధివిక్రయాలు యదేచ్ఛగా కొనసాగించుకోవచ్చని తెలిపారు. అంబర్ జోన్లో నియమిత కాల పరిమితులలో మాత్రమే వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఇళ్లల్లో, దుకాణాల్లో ఉన్న చిరు వ్యాపారులకు వీధివిక్రయదారులుగా గుర్తించే అవకాశం లేదన్నారు. ప్రభుత్వ నియమాలను అనుసరించి సర్వేను పూర్తి చేసి ఈ నెల 14వ తేదీలోపు నివేదిక అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఓ సింహాచలం, టౌన్ సర్వేయర్ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరి చిరస్మరణీయులు

విశాలాంధ్ర - విజయనగరం: విప్లవ జ్యోతిగా, పోరాట యోధునిగా, మన్యం వీరునిగా అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని నగర మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని నగరపాలక సంస్థ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సహాయ కమిషనర్ సిహెచ్ కిల్లాన.అప్పలరాజు, మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరాజు, ఇతర సిబ్బంది అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు చూపిన పోరాటపటిమ చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. గిరిజనుల అణచివేతను వ్యతిరేకించిన అల్లూరి సీతారామరాజు ఉద్యమ బాట పట్టి బ్రిటిష్ సైన్యాన్ని గడగడలాడించారని అన్నారు. విప్లవ జ్వాలను రగిలించిన మహాయోధుడు అని కొనియాడారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అతి పిన్న వయసులోనే ప్రపంచ ఖ్యాతిని గడించిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజని కొనియాడారు. ఆయన పోరాటం ధైర్య సాహసాలకు నిదర్శనమని అన్నారు. బ్రిటిష్ తూటాలకు ఎదురొడ్డి ప్రాణాలను సైతం త్యజించిన గొప్ప త్యాగశీలని శ్లాఘించారు. ఆయన స్ఫూర్తితో అంకితభావంతో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాదరావు,టీ పి ఆర్ ఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ పాలవలస గౌరికి ఘన సన్మానం

విశాలాంధ్ర - బాడంగి: బాడంగి మండలం ఎరుకలపాకుల గ్రామానికి ఎన్నో సేవలు అందిస్తున్న ఎంపిటిసి పాలవలస గౌరి పలువురికి ఆదర్శవవాదని టి టి డి - సమర సత సేవా ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. 1988 సంవత్సరం నుంచి రాజకీయాలలో ఉంటూ ప్రజలకు సేవలు అందించడమే కాకుండా ఎరుకులపాకల గ్రామంతో పాటు విజయనగరం జిల్లా ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షులు హోదాలో ను ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా సేవ చేస్తున్న పాలవలస గౌరి ను బుధవారం ఘనంగా సన్మానించరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామమైన ఎరుకల పాకలలో సామాజిక స్పృహతో పాటు ఆధ్యాత్మిక భావనతో అనేక దేవాలయాలను నిర్మించి వాటి నిర్వహణ వ్యయం మొత్తం ఆయనే భరిస్తూ ఎరుకుల పాకల గ్రామ ప్రజలందరినీ భక్తి భావన మార్గం వైపు నడిపిస్తున్నారని అన్నారు. ఒక గిరిజన నాయకుడైన పాలవలస గౌరి వారి సేవలను గుర్తించి సమరసత సేవా ఫౌండేషన్ వారికి ఎరుకూరుపాకల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారికి మా గ్రామం తరపున ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావుని పరామర్శించిన కోళ్ల

విశాలాంధ్ర - వేపాడ: ఇటీవల కంటికి శస్త్ర చికిత్స చేయించుకున్న చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావుని బుధవారం శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. అలాగే ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఆమె వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పలరాంప్రసాద్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల రామకృష్ణ, టిడిపి నాయకులు కొట్టాన విజయ కుమార్ పాల్గొన్నారు.35

విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవ జ్యోతి అని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతికి అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. అల్లూరి చేసిన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. సెట్విజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, జెడ్పి సిఈఓ బివి సత్యనారాయణ, డీపీఓ టి.వెంకటేశ్వర్రావు, జెడిఏ విటి రామారావు, సెట్విజ్ సిఈఓ సోమేశ్వర్రావు, జిల్లా పర్యాటకాధికారి కుమారస్వామి, సమగ్ర శిక్ష ఏపిసి డాక్టర్ రామారావు, డిబిసిడిడబ్ల్యూఓ జ్యోతిశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చామలాపల్లి మాజీ సర్పంచ్ కుంచి భారతమ్మ మృతి

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కుంచి భారతమ్మ బుధవారం మృతి చెందారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి క్షీణించడంతో మృతి చెందారు. కాగా వేపాడ మండలం ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయుడు కుంచి కోటేశ్వరరావు సతీమణి భారతమ్మ సర్పంచ్‌గా విశేష సేవలు అందించి ఉత్తమ సర్పంచ్ అవార్డును పొంది మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

సాగు నీటి సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష

విశాలాంధ్ర - బొబ్బిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే బేబీ నాయన పిలుపునిచ్చారు. అందులో భాగంగానే రైతులకు సాగు నీరు, తాగు నీరు అందించడానికి నియోజకవర్గంలో ఉన్న వెంగళరాయసాగర్ నుంచి వీఆర్ఎస్ కెనాల్ ద్వారా అలజంగి దాలిందొర చెరువు, పిరిడి సీతారాం సాగర్(చుట్టు చెరువు)కి సాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని సంబంధిత శాఖ ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) ఆదేశించారు. ఈ విషయమై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చించి, కావలసిన నిధులు మంజూరయ్యేలా చూస్తానని తెలిపారని ఎమ్మెల్యే తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి భక్తులకు ప్రసాద వితరణ

విశాలాంధ్ర - రాజాం: శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవం సందర్భంగా రాజాం కస్పావీధి చివరలో గల మాధవబజార్ జంక్షన్ వద్ద విశ్వబ్రాహ్మణ సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షులు, విశ్వబ్రాహ్మణ సొసైటీ అధ్యక్షులు ముగడ శ్రీను వాసరావు ఆధ్వర్యంలో స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు పులిహోరా, మజ్జిగ, మంచినీరు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ టీడీపీ అధ్యక్షులు నంది సూర్య ప్రకాశరావు, టంకాల కన్నం నాయుడు, విశ్వబ్రాహ్మణ సొసైటీ నాయకులు ముంతా రమేష్, సింహాద్రి ఆనంద్, చంద్ర రావు, టి.సంతోష్ కుమార్, అప్పల రాజు, ప్రకాష్, హరిబాబు, నవీన్, నాగేశ్వరరావు, రమేష్, విష్ణు, కొత్తలంక రాంబాబు తదితర సొసైటీ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కళా వెంకటరావుకు పరామర్శ

విశాలాంధ్ర - మెరకముడిదాం: ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేసుకున్న రాష్ట్ర టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును టీడీపీ

నేతలు బుధవారం రాజాంలో ఆయన స్వగృహంలో కలిశారు. గాదిలమర్రివలస టీడీపీ నాయుకులు చల్ల చిన్న అప్పలనాయుడు, సర్పంచ్ గొర్లె రామారావు, సీనియర్ నాయకులు దాది అచ్చంనాయుడు, చౌడువాడ ఈశ్వరరావు, తలచుట్ల రామారావు, తలచుట్ల వెంకటప్పులనాయుడు, రౌతు మహేష్, వలిరెడ్డ రమణ, గొర్లె అప్పల నాయుడు, అట్టాడ వెంకటప్పలనాయుడు, చల్ల సత్యం నాయుడు, వైస్ సర్పంచ్ చల్ల శ్రీనివాస్, తర్లాడ రామకృష్ణ పరామర్శించారు.

1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - వంగర: విద్యా హక్కు చట్టం ప్రకారం వంగర మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని వంగర మండల విద్యాశాఖ అధికారి -1 పి.ప్రవీణ్ కుమార్, ఎంఈఓ -2 కే జగదీశ్వరి తెలిపారు. మండలంలోని వివేకా మాస్టర్ మైండ్, డేనియల్ ఆర్.సి.యం స్కూల్స్‌లో 25 శాతం ఉచిత సీట్ల భర్తీకి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అనాథలు, హెచ్ఐవి భాదితులు, విభిన్న ప్రతిబా వంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ, ఓసి వర్గానికి చెందిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆగష్టు 31 నాటికి 5 సంవత్సరాలు పూర్తయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నవధాన్యాలతో సాగు నేలతల్లి బాగు

విశాలాంధ్ర- సంతకవిటి/రాజాం: సంతకవిటి మండలం గుల్ల సీతారాంపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జి పాత్రుని వెంకటరమణ మోడల్ మేకర్ అన్నమ నాయుడు తన సొంత పొలంలో ఎకరా విస్తీర్ణంలో 30 రకాల నవధాన్యాల విత్తనాలతో 25 కేజీలు చొప్పున వేసుకోవడం జరిగింది. ముఖ్యంగా నవధాన్య విత్తనాలు జీలుగు, కట్టెలు జనుము, పిల్లి పెసర మినుములు ఉలవలు, కందులు, రాగులు, ఊదలు, అలసందలు, తోటకూర, చుక్కకూర తదితరాలు సొంత పొలంలో వేసుకున్నారు.ప్రతి రైతు ఈ ఖరీఫ్ సీజన్లో తమకున్న విస్తీర్ణంలో ఈ నవధాన్యాల సాగు చేయాలని వాటి ఉపయోగాలు రైతులకి తెలియపరచడం జరిగింది.